ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

వరంగల్, ఆదివారం, 28-06-2026



# అభివృద్ధి 'విస్తరణ'

## పేదవాడి బతుకు 'ధ్వంసమేనా'!

- కేసముద్రంలో బుల్డోజర్ల కింద నలిగిన సామాన్యుడి జీవనాధారం
- ముందస్తు ప్రత్యామ్నాయం లేకుండానే దుకాణాల కూల్చివేత
- రోడ్డున పడ్డ వందలాది కుటుంబాలు..
- ఉపాధి కోల్పోయి లబోదిబోమంటున్న బాధితులు
- రాష్ట్రస్థాయి నేతలున్నా కన్నీరే మిగిలిందంటూ బోరున విలపిస్తున్న స్థానికులు
- 'వేం అన్న మాకు దారి చూపు' అంటూ కన్నీటి వినతులు

### - బాధితులను ఆదుకోవాలి

**కన్నెబోయిన శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ మండల నాయకుడు**




"రోడ్డు విస్తరణ వల్ల ఉపాధిని కోల్పోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. వారికి స్వయం ఉపాధి కోసం ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేయాలి. వీధిన పడ్డ ప్రతి కుటుంబాన్ని నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పరామర్శించి భరోసా కల్పించాలి. అధికారులతో తక్షణమే సర్వే చేయించి నష్టపోయిన వారందరికీ న్యాయం జరిగేలా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతాం."

### 'వేం అన్న.. నీవే మాకు దిక్కు'

అభివృద్ధి పేరిట పేద ప్రజల బతుకులను బుల్డోజర్ల కింద నలిపేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా వినబడుతున్నాయి. ఈ తరుణంలో వందలాది పేద కుటుంబాలు "వేం అన్న నీవే మాకు దిక్కన్న.. మాకు న్యాయం చేయండి" అంటూ వేడుకుంటున్నారు. వేరే ప్రదేశాలలో షాపులను నెలకొల్పడానికి తమకు ఆర్థిక సహాయం అందించాలని వేం నరేందర్ రెడ్డికి బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఓట్లు వేసి గెలిపించిన నేతలు ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తున్నారని, రానున్న రోజులలో ఏ మొహం పెట్టుకొని మళ్ళీ ఓట్లు అడగడానికి వస్తారో చూస్తామంటూ హెచ్చరిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, వేం నరేందర్ రెడ్డి తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించి, ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కన్నీరుమున్నీరవుతున్నారు.






**కేసముద్రం, జూన్ 28 (ప్రభాత గమనం):**

అభివృద్ధి అనే పదానికి ఒక్కోసారి సామాన్యుడు సైతం చెల్లించే మూల్యం చాలా పెద్దదిగా ఉంటుంది. తాజాగా కేసముద్రం పట్టణ కేంద్రంలో జరుగుతున్న పరిణామాలు దీనికి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పట్టణ సుందరీకరణ, రోడ్ల విస్తరణ అవసరమే అయినప్పటికీ.. బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయాలు చూపకుండా, ముందస్తు వ్యూహం లేకుండా అధికారులు చేపట్టిన కూల్చివేతల పర్వం వందలాది పేద, మధ్యతరగతి కుటుంబాల పొట్టగొట్టింది. దశాబ్దాలుగా అదే చిన్నపాటి వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న వందల కుటుంబాలు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో రోడ్డున పడ్డాయి.

**నెరవేరని హామీలు.. కన్నీరుమున్నీరవుతున్న వ్యాపారులు**

పట్టణ కేంద్రంలోని షాపులను అకస్మాత్తుగా నేలమట్టం చేయడంతో స్థానిక వ్యాపారులు కోలుకోలేని దెబ్బతిన్నారు. "తరతరాలుగా ఇక్కడే చిన్నా, చితకా అంగడి పెట్టుకుని బతుకుతున్నాం. ఇప్పుడు రోడ్ల విస్తరణ పేరుతో షాపులను కూల్చేసి మమ్మల్ని ఒక్కసారిగా రోడ్డున పడేశారు. రేపటి నుండి పిల్లలకి అన్నం ఎలా పెట్టాలో అర్థం కావడం లేదు" అంటూ బాధితులు బోరున విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. కూల్చివేతల కారణంగా కిరాణా కొట్లు, చిన్నపాటి హోటళ్లు, మెకానిక్ షాపులు, పాన్ డబ్బాలు, వైర్ బెండింగ్ షాపులు, ఆటో బైక్ మెకానిక్ షాపులు, ఇంటర్నెట్ సెంటర్లు నడుపుకునే వందలాది కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కోల్పోయాయి. తమకు ఎలాంటి పరిహారం లేదా పునరావాసం కల్పించకుండా ఇలా వీధిన పడేయడంపై ఓట్లేసి గెలిపించిన ప్రజాప్రతినిధులపై బాధితులు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

---



## తెలంగాణ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మంద రవి

**ప్రభాతగమనం, కేసముద్రం :**

తెలంగాణ ఆటో యూనియన్ నూతన అధ్యక్షుడిగా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మంద రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంజేడు ముసలమ్మ దేవస్థానంలో ఉప్పరపల్లి గ్రామ ఆటో యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందరవి, ఉపాధ్యక్షుడిగా కొప్పరి కృష్ణ, కార్యదర్శిగా కంచ కుమార్, ఆర్గనైజర్ గా సాయి కుమార్, గౌరవ అధ్యక్షులుగా జోగు మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు మంద రవి మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఆటో యూనియన్ సభ్యుల సమస్యలకై పోరాడుతానని తెలిపారు. సభ్యుల హక్కులకై నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మంద రవికి ఆటో యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.